క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వితరణ



బాధతురాలు బాయమ్మకు సాయం అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మహిళలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం సాయం అందించారు. రేపాకగొమ్ము గ్రామంలో కారం బాయమ్మ ఇల్లు దగ్ధమై నిరాశ్రయురాలైంది. బాయమ్మ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూ.7 వేలు నగదు, వంట సామగ్రి, నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, కురిమెల్ల రమేస్, గేరా చక్రి, ముళిశెల్లి రాము, జార్తి భిక్షం, ఆదిలక్ష్మి, కమ్మచిచ్చు వేణు, ఆకుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాత వీరరాఘవులుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న కిషోర్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఉండి మండలం ఉనుదుర్రు గ్రామానికి చెందిన బండారు వీరరాఘవులు శనివారం రూ.1,00,116 లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ విరాళం బాండ్‌పత్రాన్ని అందజేశారు. దాత ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోటి దాటిన సహస్రనామ పారాయణ



ఆలయం వద్ద పారాయణ నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీచింతాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న లలితా సహస్రనామ పారాయణ శనివారానికి కోటిమార్లుకు దాటింది. అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి ఆటంకాలు లేకుండా పూర్తి కావాలనే సంకల్పంతో జూలై 6న తొలి ఏకాదశి సందర్భంగా పారాయణ ప్రారంభమైంది. 80 మంది వరకు భక్తులు పారాయణలో పాల్గొంటున్నారు.

సన్నాయి వాయిద్యంలో పవన్ వెంకట్ ప్రతిభ



పవన్ వెంకట్‌ను సత్కరిస్తున్న దేవస్థానం ఈఓ మూర్తి

ద్వారకాతిరుమల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలోని డైట్ కళాశాలలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించిన కళా ఉత్సవ్-2025 జిల్లా స్థాయి పోటీల్లో ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం హైస్కూల్ విద్యార్థి సన్నాయి వాయిద్యంలో సత్తా చాటాడు. పదో తరగతి చదువుతున్న బొండాడ పవన్ వెంకట్ సోలో మ్యూజిక్ సన్నాయి వాయిద్యంలో ప్రథమ బహుమతి సాధించాడు. శనివారం శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి పవన్ వెంకట్‌కు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, సత్కరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం ప్రతిభ కనబరచి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పప్పు శేష కుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు చొక్కా కాంతారావు తదితరులున్నారు.

సీనియర్ న్యాయవాది మృతి




సూర్యనారాయణ మూర్తి (ఫైల్)

జంగారెడ్డిగూడెం: ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తాతవోలు సూర్యనారాయణమూర్తి (టీఎస్ఎన్ఎం) హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో మృతిచెందారు. మృతదేహాన్ని శనివారం జంగారెడ్డిగూడెంలోని ఆయన నివాసానికి తీసుకురాగా, జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీఎస్సార్ మూర్తి, సీనియర్ న్యాయవాదులు పొన్నా లక్ష్మణరావు, ఎన్‌వీబీఎల్ ఆచారి, మేకా ఈశ్వరయ్య, ఎంజీఆర్, మానికల సూరిబాబు, సీహెచ్‌డీవీ కోటేశ్వరరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త!

- ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయొద్దు
- మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి



ఆర్‌టీఓ ఈ చలాన్ పేరుతో వాట్సప్ గ్రూపులలో దర్శనమిస్తున్న ఏపీకే ఫైల్



కుక్కునూరు పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుక్కునూరు: ప్రపంచం మొత్తం సెల్‌ఫోన్ వినియోగించనిదే ఏ పని జరగని పరిస్థితి నేడు ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల పల్లెల్లో ఒకే ఇంట్లో రెండు, మూడు సెల్‌ఫోన్‌లు వినియోగించేలా ప్రజల జీవితాల్లోకి సెల్‌ఫోన్ చొచ్చుకుపోయింది. ప్రజలు సౌకర్యవంతంగా ఇంట్లో ఉండే తమ పనులు చక్కబెట్టుకునేలా ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్, గేమింగ్ ఇలా ఒక్కటేమిటి ప్రతీదీ సెలఫోన్ ద్వారానే చేసుకునేలా టెక్నాలజీ అభివృద్ధి చెందింది. సెల్ ఫోన్‌తో ఎంత సౌకర్యంగా ఉందో అంతేస్థాయిలో మోసపోయే ప్రమాదమూ పొంచి ఉంది. రోజుకో తీరులో సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. సెల్‌ఫోన్ లేకుంటే క్షణం కూడా గడవని ఈ రోజుల్లో ఇదే సెల్‌ఫోన్ ద్వారా సైబర్ నేరగాళ్లు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి తమ ఖాతాల్లో సొమ్మును ఖాళీచేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

కుక్కునూరు మండలంలో ఇలా..

సైబర్ నేరగాళ్ల మోసం పట్టణాల నుంచి ఏజెన్సీలోని మారుమూల పల్లెలకూ పాకింది. ఇటీవల కుక్కునూరు మండలానికి చెందిన ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌కు ఆన్‌లైన్ టాస్క్‌లు పూర్తి చేసి సంపాధించండని వచ్చిన మేసేజ్ చూసి సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కి రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. మరో యువకుడు లోన్ యాప్ ద్వారా రూ.1 లక్ష సమర్పించుకున్నాడు. కొండపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు ఫోన్ చేసిన కేటుగాళ్లు ప్రభుత్వ స్కీమ్‌కు సంబంధించి డబ్బులు జమకావాలంటే ఫోన్‌పేకు పంపించిన లింక్‌ను క్లిక్ చేస్తే స్కీమ్‌కు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమవుతాయని చెప్పడంతో ఆ మహిళ ఓ వ్యాపారి వద్దకు వెళ్లి అతని ఫోన్ పే నుంచి లింక్‌ను క్లిక్ చేయిండంతో సుమారు రూ.30 వేలకు పైగా కొల్లగొట్టారు. ఇలా మరెన్నో ఘటనలు ఉన్నాయి. ఓ యువకుడి సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరించినటువంటి ఘటనలూ ఉన్నాయి.

హ్యాక్ అవుతున్న ఫోన్లు

ఇటీవల సోషల్ మీడియాలో సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సప్ ద్వారా పంపతున్నారు. వాటిని ఓపెన్ చేసి ఓకే అని క్లిక్ చేసేవారి ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తొంది. ఈ విషయం తెలియని వారు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే సైబర్ నేరగాళ్లు పిన్ నంబర్ తెలుసుకోని నిమిషాల్లో బాధితుడి బ్యాంక్ ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. నేరగాళ్లు ఆ ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్‌లకు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. తమకు తెలిసిన వ్యక్తి నుంచి మేసేజ్ వచ్చిందని భావించిన ఇతరులు ఆ ఏపీకే ఫైళ్ల లింక్‌ను ఓపెన్ చేయడంతో ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ రివార్డ్స్, ఆర్‌టీఏ ఈ చలాన్ తదితర లింకుల పేరిట మేసేజ్‌లు పంపుతూ బ్యాంకు ఖాతాల నుంచి నగదు లాగేస్తున్నారు.

ఆగని ఘటనలు

సైబర్ మోసాలపై ప్రభుత్వాలు వివిధ రకాలుగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ మోసాలు ఆగడం లేదు. ప్రతి రోజు ఏదో ఒకోట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి సొమ్ము పోగోట్టుకున్న ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తతోనే ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రధానంగా ఏపీకే ఫైల్స్ పంపి వాటిన ఓపెన్ చేస్తే ఉన్న సొమ్మంతా మాయం చేస్తున్నారు. ఉద్యోగాలిప్పిస్తామని లింక్‌లు పంపించి ఆ తరువాత సొమ్ము రాబట్టి మోసం చేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలి.

– కొవ్వూరి రాజారెడ్డి, ఎస్సై, కుక్కునూరు

22 నుంచి దసరా ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ పంచభూత మరకత లింగేశ్వర సహిత శ్రీచక్ర సమన్విత శ్రీ విజయదుర్గమ్మవారి తృతీయ శరన్నవరాత్రి మహోత్సవాలు, రామచంద్రాపురంలోని కోదండ రామాలయంలో దసరా ఉత్సవాలు ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీలు శనివారం తెలిపాయి. 22న బాలా త్రిపుర సుందరిగా, 23న గాయత్రిగా, 24న అన్నపూర్ణగా, 25న కాత్యాయనిగా, 26న మహాలక్ష్మిగా, 27న లలితా త్రిపుర సుందరిగా, 28న మహాచండిగా, 29న సరస్వతిదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిగా, 2న రాజరాజేశ్వరిగా అమ్మవారు పూజలు అందుకుంటారని వివరించారు. ఈ మేరకు కార్యక్రమాల బ్రోచర్‌ను విజయదుర్గమ్మ ఆలయంలో ఆవిష్కరించారు. అక్టోబర్ 3న అమ్మవారికి తెప్పోత్సవం, 4న లడ్డు ప్రసాదం, శేషవస్త్రాల వేలంపాట, 11 గంటలకు అన్నసమారాదన, గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 4న 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ, లడ్డు పాట, అనంతరం గ్రామోత్సవం నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయని కోదండ రామాలయం కమిటీ పేర్కొంది.

జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత గుండె వైద్య శిబిరం

జంగారెడ్డిగూడెం: నిరంతరం పని ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరమని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు గుండె వైద్య పరీక్షల శిబిరం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద డాక్టర్ వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎస్పీ యు.రవిచంద్ర ప్రారంభించారు. జర్నలిస్టు, భార్య, తల్లి తండ్రులకు గుండె సంబంధ బీపీ, షుగర్, కన్సల్టేషన్, ఈసీజీ, 2డి ఏకో వైద్య పరీక్షలు ఉచితంగా చేసారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.వేణు జర్నలిస్టులకు వైద్య పరీక్షలు చేసి, సలహా సూచనలు ఇచ్చారు.

పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

చింతలపూడి : స్థానిక పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా తిరుమెల్లి రామారావు, డైరెక్టర్లుగా నందిపాం నాగేశ్వరరావు, చిక్కాల శ్రీనివాస రావులతో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. పీఏసీఎస్ సీఈఓ ఎంవీఆర్ఎల్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను ప్రోత్సహించాలి

దెందులూరు: ప్రజల ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను ప్రోత్సహించడమే ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవ లక్ష్యమని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం జరిగింది. నర్సింగ్ విద్యార్థినులతో ఆయన మాట్లాడారు.

జీవనోపాధికి ఒకేషనల్ విద్య దోహదం

గణపవరం: ఒకేషనల్ విద్య జీవనోపాధికి దోహదపడుతుందని, విద్యార్థులు విద్యతోపాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. ఆయన హైస్కూల్‌లో ఒకేషనల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఒకేషనల్ విద్య ద్వారా వారికి ఆసక్తి ఉన్న విషయాలపై శిక్షణ పొందవచ్చునని, తద్వారా జీవితంలో వారు సొంత కాళ్లపై నిలబడే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులకు ప్రతి వారం క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వారికి వివిధ వ్యాపారాలు, వృత్తులు, పరిశ్రమల గురించి అవగాహన కల్పించాలని, ఆయా విషయాలలో మెళుకువలు నేర్పించాలని సూచించారు. హెచ్ఎం తోట సింహాద్రిఅప్పారావు మాట్లాడుతూ ఒకేషనల్ ఒకేషనల్ విద్యలో భాగంగా విద్యార్థులను వారానికి ఒకరోజు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వివిధ వ్యాపారసంస్థల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రథమశ్రేణి సహాయకుడు హోతా ఆంజనేయులు, ఉపాధ్యాయులు, ఒకేషనల్ టీచర్ స్రవంతి పాల్గొన్నారు.

రేపటి నుంచి పశువులకు వ్యాక్సిన్లు




కొయ్యలగూడెం పశు వైద్యశాల వద్ద వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం / జంగారెడ్డిగూడెం: పశువులకు 7వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు నూజివీడు పశువైద్య డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెల రోజుల పాటు వేయనున్నట్టు పరింపూడి పశువైద్య అధికారి బీఆర్ శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎస్‌వీ శేఖర్‌దొర శనివారం తెలిపారు. మూడు నెలలు వయసు దాటిన ప్రతి గోజాతి, గేదజాతి పశువులకు టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలంలో 22,218 పశువులకు వ్యాక్సిన్లు వేస్తామని తెలిపారు. పరింపూడిలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో, పొంగుటూరు, దిప్పకాలయపాడులో 16, 17, 18, చొప్పరామన్న గూడెం 18, కన్నాపురంలో 19, 20, 22, ఏడువాడల పాలెం 19, గవరవరం 20, కనకాద్రిపురం 22, కన్నాయిగూడెం, మహదేవపురంలో 23, కుంతలగూడెం, రాజవరంలో 24, 25, మంగపతిదేవీపేటలో 24, యర్రంపేటలో 26, 27, 29, బయ్యన్నగూడెంలో అక్టోబర్ 1, 3, 4, 6, 7, రామానుజపురంలో 8, 9, సరిపల్లిలో 10, వేదాంతపురంలో 11, 13 తేదీల్లో టీకాలు వేస్తారని వివరించారు.

- జంగారెడ్డిగూడెం మండలంలో 24,822 పశువులకు వ్యాక్సిన్లు వేయనున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో 15, 16, 17 తేదీల్లో, తిరుమలాపురం 18, 19, 20, 22, అక్కంపేట 18, ఎ.పోలవరం 19, 20, మాతన్నగూడెం 22, మైసన్నగూడెం 23, 24, పట్టెన్నపాలెం, పుల్లేపూడి 24, శ్రీనివాసపురం 25, 26, 27, తాడువాయి 30, అక్టోబర్ 1, 3, పంగిడిగూడెం 3, 4, వేగవరం 4, 6, 7, గుర్వాయిగూడెం 6, 7, చక్రదేవరపల్లి 8, 9, 10, కేతవరం 8, 9, లక్కవరం 10, 11, 12, దేవులపల్లి 11, అమ్మపాలెం 13, నిమ్మలగూడెం 14వ తేదీన టీకాలు వేయనున్నట్టు వివరించారు. మూడు బందాలు నిర్దేశిత గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొంటాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు పశు వైద్యశాలల వద్ద పశువులకు టీకాలు వేశామని శ్రీనివాస్ తెలిపారు.

గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు



శ్రీవెంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు జంగారెడ్డిగూడెంకు చెందిన బొడ్డు వీరాంజనేయులు, ఈడ్పుగంటి వెంకట సుబ్బారావు, గట్టు మోహన సాయి సందీప్‌లు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను అర్చకులు సత్కరించారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు వైష్ణవ సాంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణాష్టమి పూజ ఉట్టు కొట్టే పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ కలగర శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 16న సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో ప్రారంభమై మూడు రోజు పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

అభిషేక సేవ

గుర్వాయిగూడెం మద్దిక్షేత్రంలో శనివారం స్వామి ఉత్సవ విగ్రహానికి అర్చకులు అభిషేక సేవ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,53,423 సమకూరిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. హనుమాన్ చాలీసా, కోలాటం ప్రదర్శించారు.

మెగా లోక్ అదాలత్‌లో 97 కేసుల పరిష్కారం



చింతలపూడి : మాట్లాడుతున్న జడ్జి మధుబాబు



జంగారెడ్డిగూడెం : లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి కిషోర్ కుమార్

చింతలపూడి : మెగా లోక్ అదాలత్‌లో శనివారం 97 కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు వర్గాలు తెలిపాయి. జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధు బాబు కేసులను పరిశీలించి పరిష్కరించారని పేర్కొన్నాయి. కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మధు బాబు మాట్లాడారని, ఎక్సైజ్ కేసుల్లో రూ.35,080, ఇతర కేసుల రికవరీ కలిపి మొత్తం రూ.50,48,672 కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారని వివరించాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యాయవాదులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ నిర్వహించారు. ఐపీసీ 38, ఎక్సైజ్ 21, చెక్‌బౌన్స్ 7, మనోవర్తి 2, సివిల్ 4, బెంచ్ కోర్టు 71, బీఎస్ఎన్ఎల్ 25 కేసులు మొత్తం 169 కేసులు పరిష్కారమైనట్టు కిషోర్ కుమార్ తెలిపారు. బెంచ్ మెంబర్ ఎం గంగరాజు (ఎంజీఆర్), బార్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి అభినందనీయం



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

ఏలూరు (టూటౌన్): గత 38 సంవత్సరాలుగా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఏలూరులోని దొండపాడులో గల పరివర్తన్ బధిరుల పాఠశాలలో ఉమా ఎడ్యుకేషనల్ – టెక్నికల్ సొసైటీ నిర్వహించిన 38వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు 200 మంది సిబ్బందితో వేలాది మంది దివ్యాంగులకు సేవలందిస్తూ, అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు వంటివి అందించి వారి జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుండటం అభినందనీయమని అన్నారు. వ్యవస్థాపకుడు ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ సంస్థ చేసిన సేవలకు గుర్తింపుగా 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి ఉత్తమ సంస్థగా రాష్ట్రపతి అవార్డు, 2019లో మరోసారి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అవార్డుతో పాటు ఐదు జాతీయ అవార్డులను తమ సంస్థ అందుకుందని తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాల్య వివాహాలను అరికట్టి, బాలికల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ముందుకు రావాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్ అన్నారు. స్థానిక శనివారపు పేట శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్ అనే అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మం మనకు బాల్యం, పెరుగుదల, ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఉద్దేశించిందని తెలిపారు. బ్రహ్మచర్య ఆశ్రమం తర్వాత మాత్రమే గృహస్థ ఆశ్రమం వస్తుందని, వివాహం విద్య, పరిపక్వతను అనుసరించాలని సూచిస్తోందన్నారు. బాల్య వివాహం ఈ పవిత్ర కార్యక్రమాన్ని ఉల్లంఘిస్తోందని, బాధలను కలిగిస్తుందని, యుక్త వయసు రాకముందే ఏ బిడ్డను వివాహ వ్యవస్థలోనికి నెట్టకుండా చూసుకుందామని అన్నారు. జిల్లాని, ఏలూరు నగరాన్ని బాల్య వివాహ రహిత నగరంగా తయారు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, బాల్య వివాహం పట్ల భక్తులకు, అర్చకుడు హయగ్రీవా చార్యులు పూర్తి అవగాహన కలిగించారు.

ఏఐపై అవగాహన తప్పనిసరి

గణపవరం: రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలో నిలబడాలంటే ప్రతి ఒక్కరూ ఏఐపై అవగాహన కలిగిఉండాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం డిగ్రీకాలేజి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐక్యుఏసి ఆధ్వర్యంలో కెరీర్ వృద్ధికోసం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి మాట్లాడుతూ రానున్న కాలం అంతా ఏఐదేనని అందువలన విద్యార్థులు ఇప్పటినుంచే ఏఐపై పూర్తిస్థాయి జ్ఞానం పెంచుకోవాలని సూచించారు.

15న విజయవాడలో ధర్నాకు తరలిరండి

దెందులూరు: భవననిర్మాణ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం, స్వయం ఉపాధి కాపాడుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు కోరుతూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మికు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యు లు, ఏలూరు టౌన్ ప్రెసిడెంట్ కాకర్ల శ్రీను కోరారు. శనివారం మాదేపల్లిలో ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాల్లో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

ఘనంగా మద్దిరావమ్మ సంబరాలు

దెందులూరు: దెందులూరులో తొగర కులస్తులు భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించే మద్దిరావమ్మ సంబరం చివరి శుక్రవారం సందర్భంగా గణాచార్యులు ఊరేగింపుగా వెళ్లి భక్తుల పూజలు అందుకున్నారు. రామదండు దెందులూరు మండలం నాయకులు సుగ్గుశెట్టి నూకరాజు, కుటుంబ సభ్యులు గణాచార్యులకు నీళ్లు వారబోసి వస్త్రాలు పండ్లు బహుకరించి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాల్లో నిలిచిన వర్షపు నీరు



గూటాల గ్రామంలోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు

పోలవరం రూరల్: భారీ వర్షాల ప్రభావంతో పోలవరం మండలం గూటాల గ్రామంలోని పలు వీధుల్లో వర్షం నీరు చేరింది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పట్టిసీమ, పోలవరం ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాలు, రోడ్లపైనా ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాకపోకలకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ కావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరుకుంటోంది.

కుక్కునూరులో భారీ వర్షం

కుక్కునూరు: అల్పపీడన ప్రభావంతో కుక్కునూరు శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వర్షపు నీరు చేరుకుంది. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ట్రాఫిక్ స్టేషన్‌కు కొత్త వాహనం

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు నూతన బొలెరో వాహనం వచ్చింది. జిల్లా ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌కు బొలెరో కారును గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో అందజేసింది. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు ఆక్రమణలు తొలగించామన్నారు. నగరంలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సహకించాలని కోరారు.